క్లుప్తంగా

బీసీ సంఘ అధ్యక్షుడిగా రాచబండి సత్యశేఖర్



జగ్గయ్యపేట అర్బన్‌: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రాచబండి సత్యశేఖర్ నియమితులయ్యారు. శ్రీశైలంలోని బీసీ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సంఘ జాతీయ కార్యదర్శి పి.లక్ష్మీప్రసాద్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు నుంచి నియామకపత్రం అందుకున్నట్లు సత్యశేఖర్ సోమవారం తెలిపారు. సత్యశేఖర్‌ను బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావుయాదవ్, గుమ్మా చంద్రశేఖర్, ఆనంగి శ్రీనివాసరావు, న్యాయవాది మెట్టెల ఆంజనేయులు తదితరులు అభినందించారు.

ఆలయంలో చోరీ



జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని పెద్ద శివాలయం వీధిలో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. హుండీ పగులగొట్టిన దొంగలు భక్తులు సమర్పించిన సుమారు రూ.15 వేలకు పైగా నగదును అపహరించారు. సోమవారం ఉదయం 4.30 గంటలకు ప్రధానార్చకులు సోమోజు సాయిరామాచార్యులు దేవాలయాన్ని తెరిచేందుకు వెళ్లగా ఆలయ తలుపుల తాళం పగులగొట్టి ఉంది. అలాగే హుండీ తాళం కూడా పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి సంఘ పెద్దలకు తెలియజేశారు. హుండీలో సుమారు రూ.15వేల నగదుతోపాటు రెండు వెండి నాణేలు, ఒక రాగి పైసా కూడా ఉన్నట్లు అర్చకులు తెలిపారు. ఈమేరకు దేవస్థానం నిర్వాహకులు, కామాక్షి సువర్ణ రజిత వస్తు నిర్మాణ సంఘం అధ్యక్షుడు కర్రి శేషగిరిరావు(చిన్నా) స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు ఎమ్మెల్యే అభినందన



జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో స్థానిక చెరువుబజారుకు చెందిన శీలం గోపి 93 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం తన నివాసంలో శీలం గోపిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలతో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు, స్థానిక నాయకులు ఎల్.నాగేశ్వరరావు, ఎం.రమణ, టి.పాపారావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద ఇసుక అపహరణ



జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలకు సంబంధించి నిల్వ ఉంచిన ఇసుకను కొందరు అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈవిషయంపై స్థానికులు సోమవారం పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సమీపంలో నిర్మాణ పనులు చేపట్టిన కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. టిడ్కో గృహాల మౌలిక సదుపాయాల కోసం నిల్వ ఉంచిన కంకర, ఐరన్, సిమెంట్, కేబుల్ కూడా రాత్రి పూట గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా నిర్మాణ సంస్థకు చెందిన సెక్యూరిటీగార్డులు ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు సోమవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు, అనుమానితులు, పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి రౌడీషీట్ తొలగింపునకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని ఎస్‌ఐ వివరించారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు



తిరుమలగిరి శివాలయంలో ప్రత్యేకాలంకరణలో స్వామివారు



మక్కపేట శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పెనుగంచిప్రోలులో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు



కంచికచర్లలో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు శివాలయంలో బారులు తీరిన భక్తులు

పెనుగంచిప్రోలు: పవిత్ర కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా పెనుగంచిప్రోలు మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆయా గ్రామాల్లో శివాలయాలకు పోటెత్తారు. పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు తెల్లవారుజాము నుంచే సందర్శించారు. కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండలంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. లింగాల వద్ద మునేటిలో స్నానాలు చేసి పక్కనే ఉన్న శ్రీ రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం, మంగొల్లు, గోపినేనిపాలెం గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు పూజలు చేసుకుని కార్తిక దీపాలు వెలిగించారు. రాష్ట్రంలోని ఆయా పంచారామాలను సందర్శించుకునేందుకు భక్తులు తరలివెళ్లారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : కార్తిక మాస సోమవారం సందర్భంగా కంచికచర్లపాత శివాలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామునే ఆలయానికి చేరుకుని దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాస పూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిటాల, గండేపల్లి, చెవిటికల్లు, మోగులూరు, గనిఆత్కూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు స్వామివార్లకు విశేష పూజలు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: కార్తికమాస రెండో సోమవారం నేపథ్యంలో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని పంచముఖ అమృతలింగేశ్వరునికి అర్చకులు బిళ్వార్చన, విభూదితో అభిషేకాలు నిర్వహించారు. 33 మంది దంపతులు బాణవాయు శివలింగాలను ప్రతిష్ఠించారు. అనుమంచిపల్లి శివాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. తిరుమలగిరి కొండపైనున్న శివాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామునే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్‌: మండలంలోని శైవాలయాలు కార్తికమాస పూజలతో కళకళలాడాయి. కార్తిక సోమవారం సందర్భంగా మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలాచరించి ఆయా గ్రామాల్లోని శివాలయాలలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నందిగామ పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయాల్లో అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పుష్ప, బిళ్వార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నందిగామ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



లింగాల శివాలయంలో సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు



కంచికచర్ల పాతశివాలయంలో క్యూకట్టిన భక్తులు



కోటిలింగాలలో అమృతలింగేశ్వరునికి విభూదితో అభిషేకం చేస్తున్న అర్చకులు

14న టెండర్ కం బహిరంగ వేలం

నందిగామటౌన్‌: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 14న టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో హరిగోపీనాథ్ సోమవారం తెలిపారు. నిమ్మకాయలు, కొబ్బరికాయలు తదితర పూజా సామాగ్రి అమ్ముకునే హక్కు, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్ ముక్కలు ప్రోగుచేసుకునే హక్కులకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు 14వతేదీ ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు పాల్గొనాలని ఈవో కోరారు.

నేడు మెగా జాబ్‌మేళా

కంచికచర్ల: మండలంలోని ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ఎం.శ్రీనివాసబాబు సోమవారం తెలిపారు. పదో తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ చదివినవారు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. 2500మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 300 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్లపై పారుతున్న మురుగు



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలోని చిరునగర్‌లోని వీధిలో ఉక్కు కళావేదిక వద్ద డ్రెయిన్ పొంగి పొర్లుతుండటంతో మురుగంతా రోడ్లపైకి చేరి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. డ్రెయిన్ వ్యర్థాలతో నిండి ఉండటంతో మురుగంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి కారణంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడిక తొలగింపజేసి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని చిరునగర్ వాసులు కోరుతున్నారు

ఘనంగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి

గంపలగూడెం(జగ్గయ్యపేట): గండ్రాయి మండల పరిషత్ పాఠశాలలో సోమవారం దేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌బాబు, సుబ్బారావు, రమాదేవి, దేవదానం, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్‌: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నందిగామ మండలంలోని ఆయా పాఠశాలల్లో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యా దినోత్సవం సందర్భంగా చందాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పగడం వెంకటేశ్వర్లును విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాజేంద్రబాబు, నాగరాజు, ప్యారా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గండ్రాయిలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వైభవంగా శోభాయాత్ర

జగ్గయ్యపేటఅర్బన్‌: పట్టణంలోని పాలేటి నది తీరాన రుద్రభూమిలో ఉన్న మఠం శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా కృష్ణ శిలలను తెప్పించారు. ఈ సందర్భంగా పట్టణానికి వచ్చిన కృష్ణ శిలలకు ప్రజలు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. తొలుత పట్టణంలోని సీతారామపురంలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయంలో కృష్ణ శిలలకు శాస్త్రోక్తంగా కంచిపీఠం ఆస్థాన సిద్ధాంతి లక్కావజ్ఝల సుబ్రహ్మణ్యం బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం శ్రీరఘురాం, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు, తాతి ్వకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి తదితరులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం కృష్ణ శిలలను శోభాయాత్రగా మఠం శివాలయానికి తీసుకువచ్చారు. శోభాయాత్రలో కేరళ వాయిద్యకారుల విన్యాసాలు, చిన్నారుల భరతనాట్యం, కోలాట బృందాల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మఠం శివాలయం దేవస్థానం నిర్మాణ కమిటీ ప్రతినిధులు నీలిశెట్టి వాసు, సంకా భాస్కర్, దోగుపర్తి రాము, కొంకిమళ్ల మల్లికార్జునరావు, యన్నాకుల శ్రీధర్, నోముల కృష్ణప్రసాద్, సిమ్మసర్తి మల్లి తదితరులు పాల్గొని శిల్పులను సత్కరించారు.



శోభాయాత్రలో పాల్గొన్న నెట్టెం శ్రీరాఘురాం, భక్తులు



శోభాయాత్రగా తీసుకువస్తున్న కృష్ణ శిలలు

చెత్త ఫుల్‌.. సంపద నిల్‌

- కొరవడిన చెత్త సంపద కేంద్రాల నిర్వహణ
- నిరుపయోగంగా మారుతున్న విలువైన యంత్రాలు

జగ్గయ్యపేట: చెత్త సంపద కేంద్రాల నిర్వహణ సజావుగా సాగకపోతుండటంతో విలువైన యంత్రాలు మూలకు చేరుతున్నాయి. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్తను సేకరించి వాటి ద్వారా రీసైక్లింగ్ విధానం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ కొరవడింది. వీధుల నుంచి సేకరించిన చెత్తను తడి,పొడిగా వేరు చేసి వీటి ద్వారా వానపాములతో సేంద్రియ ఎరువులుగా మార్చి రైతులకు విక్రయించి ఆదాయం పొందాలి. మరో వైపు మిగిలిన పొడిచెత్త, సీసాలు, పాలిథిన్ తదితర వాటిని వేరు చేసి విక్రయించగా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాకు జత చేయాలి. అయితే జగ్గయ్యపేట మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో ఇటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెత్త ఫుల్లుగా.. సంపద నిల్‌గా మారింది. దీంతో కొన్ని గ్రామాల్లో తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉండి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. మరికొన్ని చెత్త సంపద కేంద్రాలు పంచాయతీలకు స్టోర్ రూమ్‌లుగా మారుతున్నాయి.



కె.అగ్రహారంలో నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

క్లాప్‌మిత్రలకు అందని వేతనాలు..

జగ్గయ్యపేట మండలంలో చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ నియమించిన క్లాప్‌మిత్రలకు పూర్తిస్థాయి వేతనాలు అందడం లేదు. ఒకొక్కరికి నెలకు రూ.ఆరు వేలు వేతనంగా ఇచ్చేలా నిర్ణయించినప్పటికీ వారికి సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో వారు విధులకు గైర్హాజరవుతుండటంతో కొన్ని కేంద్రాలను సిబ్బంది కొరత సమస్య వేధిస్తోంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను డంపింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇలా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ సజావుగా సాగకపోతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలనే లక్ష్యం నీరుగారుతోంది.



జయంతిపురంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం..

గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణకు తగిన చర్యలు తీసుకోకపోతుండటంతో గ్రామాల్లో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా బూదవాడ, రెడ్డినాయక్ తండ, జయంతిపురం, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట, మల్కాపురం గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వాన్నంగా ఇందుకు నిదర్శనం. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో అంటు వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతోపాటు చెత్త సంపద కేంద్రాలని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం. ఈ కేంద్రాల ద్వారా లక్ష్యం నెరవేరాలా చేస్తాం. సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు కూడా సంపద తయారీ కేంద్ర నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం. తద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం.

– పద్మావతి, జగ్గయ్యపేట ఈవోపీఆర్డీ

పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్

నందిగామటౌన్‌: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. నందిగామలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏఎంసీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.ఐదు వేలకు మించి ధర ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికే వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాకు రూ. 12వేలు పలుకుతుంటే మనదేశంలో రూ.7,510గా నిర్ణయించడం బాధాకరమని పేర్కొన్నారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఈనెల 8వతేదీన ప్రారంభించిన సీసీఐ కొనుగోలు కేంద్రం నిరుపయోగంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయుడి వెంకటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, ఏడుకొండలు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పీవీ ఆంజనేయులు, చనుమోలు సైదులు, నాయకులు

డిసెంబర్ 16న పెన్షన్ అదాలత్

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో డిసెంబర్ 16న నిర్వహించనున్న పెన్షన్ అదాలత్‌ను అన్ని విభాగాల పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ అధ్యక్షుడు ఎస్కే చాంద్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యలు ఈ నెల 20వ తేదీ లోపు రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు డిప్యూటీ సీపీవోకు అందజేయాలని కోరారు.